క్లుప్తంగా

కొనుగోళ్లు ప్రారంభించండి



రైతుబజార్‌ను సందర్శిస్తున్న నాయకులు

హుస్నాబాద్: రైతుబజార్‌లో కొనుగోళ్లు ప్రారంభించాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. రైతుబజార్ కేంద్రాన్ని ఆదివారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించిన రైతు బజార్‌ను ప్రారంభించి దాదాపు ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇంకా అందుబాటులోకి తేలేదన్నారు. రైతుబజార్ లేకపోవడంతో రైతులు, వ్యాపారులు రోడ్ల పక్కనే అమ్ముకుంటున్నారని, వెంటనే కొనుగోళ్లు ప్రారంభించి వారి ఇబ్బందులు తొలగించాలని కోరారు. చంద్రయ్య, మల్లికార్జున్‌రెడ్డి, సారయ్య, మోహన్‌రెడ్డి, శ్యాంసుందర్ గౌడ్, వికాస్ యాదవ్, వెంకన్నగౌడ్ పాల్గొన్నారు.

పోచమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

జగదేవపూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్‌నర్సాపూర్ సమీపంలోని కొండపోచమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం కొమురవెల్లి మల్లన్నను దర్శించుకుని మధ్యాహ్నం కొండపోచమ్మకు మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు.

బీసీ రిజర్వేషన్లపై ఏది చిత్తశుద్ధి?

మద్దూరు(హుస్నాబాద్): బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదని కురుమ సంఘం రాష్ట్ర నాయకుడు, కొమురవెల్లి ఆలయ మాజీ చైర్మన్ మేక సంతోష్‌కుమార్ మండిపడ్డారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు, పార్లమెంట్, శాసన సభ ఎన్నికల్లో సైతం బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలన్నారు. చట్టసభలోనే బీసీ రిజర్వేషన్ అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. రిజర్వేషన్ల అమలు కోసం బీసీ సంఘం నాయకులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

సబ్సిడీపై మొక్కజొన్న విత్తనాలు



ఏఓ పూజ

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై మొక్కజొన్న విత్తనాలను అందిస్తుందని మండల వ్యవసాయ అధికారి పూజ ఆదివారం తెలిపారు. జాతీయ భద్రత, పోషణ మిషన్ కింద జిల్లా వ్యవసాయశాఖ సబ్సిడీ విత్తనాలను సరఫరా చేస్తుందని చెప్పారు. జాతీయ విత్తన సంస్థ విడుదల చేసిన ఎన్‌ఎస్సీ సీటీ 4260 రకం నాలుగు కిలోల బ్యాగుకు రూ.1380లు ఉండగా రైతులు రూ.980కే లభిస్తుందని, వ్యవసాయ క్లస్టరులోని ఏఈఓలను సంప్రదించాలని సూచించారు.

ఓటుహక్కుపై తీర్మానం



సమావేశమైన గ్రామ అభివృద్ధి కమిటీ

హుస్నాబాద్‌రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో డబ్బు, మద్యం తీసుకోకుండా స్వచ్ఛందంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని గ్రామ అభివృద్ధి కమిటీ తీర్మానం చేసింది. హుస్నాబాద్ మండలం గాంధీనగర్‌లో ఆదివారం గ్రామ అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై చర్చించారు. గ్రామ యువత ఆదర్శంగా ఉండటానికి ఓటుహక్కుపై ప్రజలను చైతన్యం వంతం చేయాలన్నారు. అభివృద్ధి కోసం కృషిచేసే నాయకులనే సర్పంచ్‌లుగా ఎన్నుకోవాలని, గ్రామానికి స్వచ్ఛందంగా సేవచేసే నాయకులకు మాత్రమే అవకాశం ఇవ్వాలని తీర్మానించారు. సమావేశంలో కమిటీ అధ్యక్షుడు కుమార్, అనిల్, బోజ అనిల్, కమలాకర్‌రావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడికి గురికావద్దు



మాట్లాడుతున్న శ్రీనివాస్

గజ్వేల్‌రూరల్: పదో తరగతి విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా విద్యపై దృష్టి సారించాలని సైకాలజిస్ట్ మామిడాల శ్రీనివాస్ చెప్పారు. ఎడ్యుకేషన్ హబ్, కళాశాలలోను పదో తరగతి విద్యార్థులకు ఆదివారం మెంటల్ హెల్త్ ప్రోగ్రాం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని, కుంగిపోవద్దన్నారు. కార్యక్రమంలో అధికారులు సత్యనారాయణ, జ్యోతి, గీతాంజలి, స్వప్న, లక్ష్మి పాల్గొన్నారు.

బస్తీకి వైద్య సేవలెప్పుడు?

ప్రారంభానికి నోచుకోని పల్లె దవాఖానా

- రూ.18 లక్షలు వెచ్చించారు.. వృథాగా వదిలేశారు
- మురుగు నీరు, పిచ్చిమొక్కలతో నిండిన పరిసరాలు
- అందుబాటులోకి తేవాలంటున్న స్థానికులు



బస్తీ దవాఖానా భవనం వెనుక భాగంలో పేరుకుపోయిన మురుగు నీరు

దుబ్బాకటౌన్: పట్టణ ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడానికి గత ప్రభుత్వం దుబ్బాక 14వ వార్డులో రెండేళ్ల క్రితం బస్తీ దవాఖానా నిర్మించింది. దానికి రూ.18 లక్షల నిధులు ఖర్చు చేశారు. అయితే నిర్మించి రెండేళ్లు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో మురుగు, పిచ్చిమొక్కలు, పొదలు మధ్య నిరుపయోగంగా మారింది.

బిల్లుల రాక..

నిర్మాణ పనులు పూర్తయి రెండేళ్లు గడుస్తున్నా కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో ఆ భవనాన్ని వైద్యశాఖకు అప్పగించలేదు. బిల్లు వచ్చేంత వరకు వైద్య సేవలు ప్రారంభించరా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

మురుగు నీటిలోనే..

భవనం నిర్మించి నిరుపయోగంగా వదిలేయడంతో ఇటీవల కురిసిన వర్షాలకు చుట్టూ మురుగునీరు చేరింది. అలాగే భవనం చుట్టూ పిచ్చిమొక్కలు, పొదలు ఏపుగా పెరిగి పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి.

ప్రారంభించండి సారూ..

పనులు పూర్తయినా ప్రారంభానికి నోచుకోకపోవడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అక్కడ డ్రైనేజీలు, మిగిలిన వసతులు ఏర్పాటు చేసి బస్తీ దవాఖానాను ప్రారంభించాలని, మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అందుబాటులోకి తీసుకురావాలి



రెండేళ్లుగా నిరుపయోగంగా ఉంటున్న బస్తీ దవాఖానా భవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. భవనం నిరుపయోగంగా ఉండటం వల్ల దెబ్బతింటుంది. భవనాన్ని త్వరగా ప్రారంభించి ప్రజలకు వైద్య సేవలు అందించాలి.

– తునికి సురేశ్, 14వ వార్డు



భవనం ఆవరణలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, పొదలు

వసతిగృహ కార్మికుల సమ్మెకు మద్దతు



సమ్మెలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో విధులు నిర్వహిస్తున్న రోజువారీ, ఒప్పంద కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిద్దిపేట గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు భుక్య భిక్షపతి నాయక్ డిమాండ్ చేశారు. కొద్ది రోజులుగా తమ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కేంద్రంలో సమ్మె నిర్వహిస్తున్న కార్మికులకు గిరిజన సంఘం, బీఆర్‌ఎస్వీ, ఎస్‌ఎఫ్‌ఐ సంఘాల నాయకులు ఆదివారం సంఘీభావం తెలిపారు. వారు సమ్మెలో పాల్గొని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ కార్మికులు ప్రతిపాదించిన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం అందించాలని, గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు.

విద్యుత్ లైన్ తొలగించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని రేబర్తి గ్రామం మధ్య నుంచి ఏర్పాటు చేస్తున్న విద్యుత్ లైన్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఆ గ్రామస్తులు ఆందోళనకు దిగారు. వారు మాట్లాడుతూ వంగపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న 33 11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ కోసం రేబర్తి సబ్‌స్టేషన్ నుంచి వేస్తున్న విద్యుత్ లైన్ వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్‌తో పాటు సీతారామాంజస్వామి ఆలయం మీదుగా ఈ వైర్లు వెళ్తున్నాయని, అలాగే విద్యుత్ లైన్ ఏర్పాటు కోసం నీడనిచ్చే చెట్లను నరికివేస్తున్నారని వాపోయారు. దీనిపై కాంట్రాక్టర్‌ను ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధనమిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ అధికారులు తక్షణమే స్పందించి గ్రామం వెలుపల నుంచి వైర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పనులు అడ్డుకుంటామని హెచ్చరించారు.

రెండేళ్లుగా.. అసంపూర్తిగా..



అసంపూర్తిగా ఉన్న ఆరోగ్య ఉప కేంద్రం

చిన్నకోడూరు మండల కేంద్రంలో రూ.18 లక్షలు వెచ్చించి ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణ పనులు చేపట్టారు. రెండేళ్లపాటు పనులు కొనసాగాయి. 90 శాతం పనులు పూర్తిచేశారు. ఇంకా భవనానికి పెయింటింగ్, లోపల డోర్‌లు తదితర పనులు ఇంకా పూర్తికావాల్సి ఉంది. అయితే సరిపడా నిధులు లేక మిగతా పనులు నిలిపివేశారు. దీంతో భవనం చుట్టూ పిచ్చిమొక్కలు, పొదలు ఏపుగా పెరిగి శిథిల భవనంలా మారింది. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ఆ భవనం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగాయి. ప్రస్తుతం స్థానిక పంచాయతీ కార్యాలయంలో వైద్య సేవలు కొనసాగిస్తున్నారు. అధికారులు స్పందించి నిర్మాణం పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

– చిన్నకోడూరు(సిద్దిపేట)

భయపెడుతున్న ట్రాన్స్‌ఫార్మర్

మండలంలోని అంతాయిగూడ గ్రామంలోని బతుకమ్మ చెరువులో ఓ విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ భయపెడుతోంది. వర్షాకాలంలో చెరువు పూర్తిగా నిండుతుంది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఎలాంటి విద్యుత్ వైర్లు నీటికి తాకినా ప్రమాదంగా మారే అవకాశం ఉంది. ట్రాన్స్‌ఫార్మర్‌ను మరోచోటకు తరలించాలని గ్రామస్తులు, రైతులు కోరుతున్నారు.

– జగదేవ్‌పూర్(గజ్వేల్)



చెరువు మధ్యలో ట్రాన్స్‌ఫార్మర్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని కుశాల్‌నగర్ 11కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా పట్టణంలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కుశాల్‌నగర్, తహసీల్దార్ కార్యాలయం, హరిప్రియనగర్, పీపుల్స్, భాస్కర్‌రావు, సుశ్రుత హాస్పిటళ్లు, కొత్త బస్టాండ్, విశాల్ మార్ట్ ఆవరణ ప్రాంతాల్లో సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

ఎల్‌ఓసీ అందజేత



చెక్కు అందిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాకటౌన్: పట్టణానికి చెందిన అజ్జ కిషన్‌కు మంజూరైన చెక్కును కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం అందజేశారు. కిషన్ కొన్ని రోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా ప్రభుత్వ సహకారంతో అందిన చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

మృతుడి కుటుంబానికి సాయం



నిత్యావసరాలు అందజేస్తున్న నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని అనంతసాగర్ గ్రామానికి చెందిన మెట్ల సాయిలు అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న దిశ కమిటీ జిల్లా సభ్యురాలు తిప్పని వనజ వర్మ, బీజేపీ జిల్లా నాయకులు బాపయ్య ఆదివారం ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. 25 కిలోల బియ్యం, రూ. 2వేల నగదు అందజేశారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

మార్కెట్ ఉన్నా.. రోడ్డు పక్కనే విక్రయాలు



ఖాళీగా దర్శనమిస్తున్న నాన్‌వెజ్ మార్కెట్

దుబ్బాకటౌన్: ఆదివారమైనా స్థానిక నాన్‌వెజ్ మార్కెట్ ఖాళీగా దర్శనమిస్తుందని ఆశ్చర్యపోతున్నారా? దుబ్బాక పట్టణంలో మటన్, చికెన్ అమ్మకాలు ఆదివారం విస్తృతంగా జరుగుతుంటాయి. కానీ అవన్నీ రోడ్డు పక్కనే నిర్వహిస్తున్నారు వ్యాపారులు. లక్షలు వెచ్చించి నాన్‌వెజ్ మార్కెట్ నిర్మించినా విక్రయదారుల తీరు మాత్రం మారడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో కొనుగోలు చేయడం తప్పడం లేదంటున్నారు స్థానికులు.

కార్పొరేట్‌లకు ఊడిగం చేస్తున్న మోదీ

- 9, 10న నాలుగో మహాసభలు
- సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్



తొగుటలో కరపత్రం ఆవిష్కరిస్తున్న భాస్కర్ తదితరులు

తొగుట(దుబ్బాక): మోదీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు లక్షల కోట్ల బ్యాంకు రుణాలు మాఫీ చేసిందని, పేద ప్రజలను విస్మరించి ధనవంతులకు ఊడిగం చేస్తున్నారని సీఐటీయూ జిల్లా కోశాధికారి గొడ్డుబర్ల భాస్కర్ మండిపడ్డారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. 9, 10వ తేదీల్లో సిద్దిపేటలో నిర్వహించనున్న జిల్లా 4వ మహాసభలను జయప్రదంచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యం కార్మికుల హక్కుల కోసం పోరాటాలు నిర్వహిస్తూ దేశంలో అగ్రగామి కార్మిక సంఘంగా సీఐటీయూ నిలుస్తుందన్నారు. కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వసంత, నర్సింహులు, మాణిక్యం, రాములు, యాదగిరి, పోచయ్య, నర్సయ్య, మల్లయ్య, శ్యామల, యేసు, మల్లేశం పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం

నంగునూరు(సిద్దిపేట): ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సొప్పరి రవికుమార్ అన్నారు. 24, 25న నిర్వహించే పంచాయతీ రాష్ట్ర మహాసభలపై నంగునూరులో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభలో చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో రాజమౌళి, కనకయ్య, బాలయ్య, కనకయ్య, శేఖర్, పరశురాములు, కిషన్, బాలరాజు, దేవవ్వ, కళావతి, కనకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి

మిరుదొడ్డి(దుబ్బాక): పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి డిమాండ్ చేశారు. 9, 10న జిల్లా కేంద్రంలో జరిగే జిల్లా 4వ మహాసభల కరపత్రాలను మిరుదొడ్డిలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలను చెల్లిస్తామని ఇచ్చిన హామీని సీఎం రేవంత్ వెంటనే అమలు చేయాలన్నారు. గ్రీన్ చానల్ ద్వారా నేరుగా బ్యాంకు ఖాతాలో పెండింగ్ వేతనాలను జమ చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు అంజయ్య, సురేందర్, రాములు, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి

బెజ్జంకి(సిద్దిపేట): మద్దతు ధర కల్పించేందుకు నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కోరారు. మండలంలోని గుగ్గిల్ల, రేగులపల్లె గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామన్నారు. ధాన్యం ఆరబోసి నిబంధనల మేరకు కేంద్రాలకు తీసుకు రావాలని సూచించారు. గుగ్గిల్లలో బతుకమ్మ ఘాట్ నిర్మించాలని కోరుతూ ఎమ్మెల్యేకు మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమాలలో డీఆర్‌డీఓ సుధీర్, ఏపీఓ పరశురాములు, దామోదర్, ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, రత్నాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సంతోష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కాసులాబాద్ యువతా.. భేష్



రోడ్డును బాగుచేస్తున్న కాసులాబాద్ యువకులు

మిరుదొడ్డి(దుబ్బాక): ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని ఎదురు చూసి విసిగి వేసారిన యువకులు మూడు కిలోమీటర్ల మేర గుంతలు పడి ప్రమాదకరంగా మారిన రోడ్డును బాగుచేసుకున్నారు. మండల పరిధిలోని కాసులాబాద్ యువకులు పలుగు పారలు చేతబట్టి, ట్రాక్టర్లతో మట్టిని తరలించి గుంతలమయంగా మారిన కాసులాబాద్, నాగయ్య వాగు బీటీ రోడ్డుకు ఆదివారం మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి గుంతలమయంగా మారిన రోడ్డును బాగుచేయాలని పాలకులు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని అగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు ధ్వంసం కావడంతో తరచూ ప్రమాదాలకు నిలయంగా మారిందని, ఆర్టీసీ బస్సులు కూడా రద్దయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దుబ్బాక, సిద్దిపేట ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తుమ్మల బాల్‌రాజు, గ్రామ యువకులు స్వామి, రాజు, కుమార్, యాదగిరి, రాజు, భానుచందర్, శేఖర్, సంతోష్, చక్రధర్, అరుణ్, స్వామి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

స.హ చట్టంపై అవగాహన అవసరం

- ఇరవై యేళ్లయినా ప్రజల్లో చైతన్యం కరవు
- కౌన్సిల్ ఫర్ ఆర్టీఐ అధ్యక్షుడు ఎండీ షాదుల్

సిద్దిపేటఅర్బన్: పంచాయతీ మొదలుకొని పార్లమెంటు వరకు ఒక్క దరఖాస్తుతో కావాల్సిన సమాచారాన్ని పొందేహక్కు కల్పిస్తున్న సమాచార హక్కుచట్టంపై ప్రతిఒక్క పౌరుడు అవగాహన పెంచుకొని ఆ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిల్ ఫర్ ఆర్టీఐ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎండీ షాదుల్ పిలుపునిచ్చారు. సమాచార హక్కు చట్టం 20వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడారు. చట్టం అమలులోకి వచ్చి రెండు దశాబ్దాలు పూర్తయినా ప్రజల్లో దాని ముఖ్య ఉద్దేశ్యం, దరఖాస్తు విధానం, కోరిన సమాచారం ఇవ్వకపోతే ఏం చేయాలి అనే అంశాలపై పూర్తి అవగాహన లేకపోవడం బాధాకరమని వాపోయారు. స.హ చట్టం నిజమైన ప్రయోజనం నెరవేరడానికి విస్తృత ప్రచారం కల్పించి ప్రజలను చైతన్య పర్చాలన్నారు. చట్టంలోని 17 అంశాలను ప్రతి కార్యాలయంలో ప్రదర్శించాల్సి ఉన్నా నామమాత్రంగానే ఏర్పాటు చేశారని వాపోయారు. అవినీతి రహిత సమాజ నిర్మాణం కోసం స.హ చట్టంపై అవగాహన పెంపొందించుకోవాలని కోరారు.

గజ్వేల్‌లో..

గజ్వేల్‌రూరల్: సమాచార హక్కు చట్టాన్ని నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు తీసుకోవాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండస్వామి అన్నారు. పట్టణంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద సమాచార హక్కు చట్టం 20వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై జిల్లా నుంచి మండలస్థాయి అధికారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి దరఖాస్తుకు సమాధానం ఇవ్వాలని కోరారు. కొంత మంది అధికారులు చట్టంపై నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి వేణు, నాయకులు రాజ్‌కుమార్, లక్ష్మయ్య, చంద్రం, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ‘ఆపన్నహస్తం’



సాయం అందిస్తున్న ఆపన్నహస్తం సంస్థ సభ్యులు

సిద్దిపేటరూరల్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన నిరుపేద విద్యార్థినికి గజ్వేల్‌కు చెందిన ఆపన్నహస్తం సంస్థ ప్రతినిధులు ఆదివారం రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. మండల పరిధిలోని రాఘవాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థిని ఎలుక కల్యాణి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైంది. దీంతో బ్రెయిన్‌కు దెబ్బతగలడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. పేద కుటుంబం కావడంతో వైద్యం చేయించుకునే పరిస్థితిలేదు. దీంతో విషయం తెలుసుకున్న ఆపన్నహస్తం సంస్థ సభ్యులు కల్యాణిని పరామర్శించి ఆర్థిక సహాయం చేశారు.